# బోర్



కాటూరు రవీంద్ర-త్రివిక్రమ్

"మీ వ్యక్తిగతవిషయాలగురించి ప్రశ్నిస్తే మీకు కోపం వంటిది రాదుకదా!" సంశయంగా ప్రశ్నించాడు భాస్కరరావు.

తల త్రిప్పకుండానే ఆ ప్రశ్న అడుగుతున్న ప్పుడు "భాస్కరరావు" ముఖభంగిమ ఎలాఉంటుందో ఊహ్యగలను. అయినా, తలత్రిప్పి మందహాసంతో అతని మొహంలోకి చూస్తూ "వస్తుంది. కానీ, నీకోసం తట్టుకుంటాను. నీవడగ దల్చింది నిస్సం కోచంగా అడుగు" అభయ మిచ్చాను.

నిజానికి, "భాస్కరరావు"ఏదిఅడగబోతున్నాడో నాకుతెలుసును. కానీ- అతను అడిగేటందుకు అవ కాశమీయదలచాను.

"భాస్కరరావు" కొద్దిక్షణాలు తటపటాయించి. నాలుగైదు గుటకలుమింగి చివరికి గొంతు పెగల్చు కుని "ఇలాంటివి అడగాలంటే ఒక విధంగామనకే చిన్నతనంగా ఉంటుందనుకోండి. కానీ. మన గురించి మన చుట్టూవుండే మనుషులు వింతధోర ణిలో మాట్లాడుకోవటం మన గౌరవమర్యాదల దృష్ట్యా చూస్తే ఏమంత మంచిదికాదు. ఏమం టారు?" అన్నాడు.

తలపంకించి వింటున్నాను.... వింటున్నాను చెప్పు" అన్నాను. షర్బత్ తయారు చేయడంలో మునిగి.

"ఉపోద్ఘాతం వినిపించి. నుదుటిమీద పట్టిన చిరుచెమటని దస్తీతో మెల్లగాఅద్దుకున్నాడు భాస్కర రావు.

అంటే ఇంకా అసలువిషయం ఆరంభించలే దన్నమాట

గట్టిగావున్న నిమ్మకాయల్ని అరచేతుల మధ్య నలుపుతూ కూర్చున్నాను. భాస్కరరావు ఒకమాటు పొడిగా దగ్గాడు.

"కాసిని మంచినీళ్లంటే యిస్తారూ?" అన్నాడు.

"షర్బత్ చేస్తున్నాను కదోయ్! ఓ అయిదు నిమిషాలు ఓపికపట్టు అయిపోయింది. ఈ లోగా నీ కథ విన్పించు"అన్నాను.భాస్కరరావుకి నిజంగా దాహంకాలేదని అతని మొహమే చెబుతోంది. అతని తత్వమే అంత. బోలెడు ఆవేశంఉంది. కానీ, చచ్చేటంత పిరికితనం. బిడియం!

"భాస్కరరావు" యీమాటు ధారాళంగా మాట్లాడ నారంభించాడు.

'ఫలానా మనిషి మనమధ్య బ్రతుకుతున్నా డంటే. ఆ 'ఫలానా మనిషి' గురించీ వీలయి నన్ని వివరాలు సేకరించందే మన సమాజానికి మనశ్శాంతి దొరకదు. నిద్రమాత్ర మింగినా కునుకు పట్టదు.

అందునా, ఆమనిషి గురించీ డిటెక్షన్" చేసి మరీ తెలుసుకోవలసిన అవసరం కలిగినపుడు ఆసక్తి మరీ అధికమౌతుంది. పనికివచ్చే 'క్లూ'ల కోసం వెతుకులాట ఆరంభమౌతుంది. అవి దొరికే దాకా వెన్ను, కుర్చీలో విశ్రాంతి కోరగదు.

ఉదాహరణకి "ఫలానా" మనిషి ఉన్నాడను కోండీ. ఆయన హఠాత్తుగా ఆకాశం మధ్యనుండే ఊడిపడ్డట్టు వొచ్చి. ఏమీ ఎరుగని అపరిచయస్థుల నడుమ కాపురం ఉండటానికి తన మంచితనాన్ని పణంపెట్టి ఎలాగోలా యిరికాడనుకోండి, ఆదిలో ఆయన చెప్పిన "చిలక పలుకు"ల మీదనే "సమాజం తన విశ్వాసాన్ని ఉంచుతుంది. అయి. ఆ పలుకు పవిగడుపుకునే నిమిత్తం పలికినదేమోనని సంశయం ఉత్పన్నం కావటం పరిస్థితి పరాకాష్ఠని చేరుకోవటం!" ఊపిరి పీల్చు కున్నాడు "భాస్కరరావు."

"ఇంతకీ ఆ 'ఫలానా' నేనే కానిట్టు. సర్వ నామాలు. విశేషణాలూ విస్మరించి విషయానికిరా" అన్నాను చిరునవ్వు చెరగని భంగిమతో.

"ఈ పోర్షన్ సంసారుల నడుమఉంది. అసలు దీన్ని మీ కిచ్చే ముందు మీరు వివాహితులనీ మీ భార్యని త్వరలో తీసుకురాగలరనీ ..."

"... అన్నది నేనుకాదు! నాకీ యిల్లు యిప్పిం చిన నా 'కో-వర్కర్' కామేశ్వర్రావ్. అవునా!" అడ్డుప్రశ్న వేశాను.

విశ్రాంతబోయేకు భాస్కరరావు. మొహంలో మారుతున్న రంగుల్ని యథాప్రకారం తెచ్చుకోవటానికి యత్నిస్తూ "అయితే మీకు భార్య లేదన్న మాట ?!" యీ ప్రశ్న చాలా విష్కర్షగా, విందా ఛరితంగా వెలువడింది.

మందహాసం మరల్చకుండానే "ఎందుకులేదూ! లేదని ఎప్పుడన్నాను ?" అన్నాను. అతని 'అహం' దెబ్బతింది.

అది అతనికి 'ఓటమి' వంటిదని తెలియగానే, నా పెదవులు విజయహాసంతో మెరిసాయి.

అతని మోముమీద చర్మం ఎరుపెక్కింది. "మీరు నిజంగా మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు అదే నిజమయితే మీరు యింతకాలమూ అందరినీ మోసం చేస్తున్నారన్నమాట. మీరూ, కామేశ్వర్రావ్ కూడబలుక్కుని మాచేత 'తప్పు' తినిపించారన్న మాట !" విస్ఫారం వేసాడు.

అప్పటిగ్గాని నాకు 'కోపం' రాలేదు ! ఇచ్చిన మాట ప్రకారం తట్టుకున్నాను.

"మైడియర్ యంగ్ డిటెక్టివ్ భాస్కర్రావ్ ! కాస్త శాంతం వహించు. నేను కోపం తెచ్చుకోనన్నాను కదాని నాలుక్కి 'ఫ్రీడమ్' యివ్వకు. నీ బాధ నా కర్థమయింది. నా పంజాయిషీ యిచ్చుకునే ముందు నీ సమాధానాన్నాశించి కొన్ని ప్రశ్నలు.,"

'భాస్కర్రావ్' అలాగే కొయ్యబారినట్లు కుర్చీకి అతుక్కుపోయి దిష్టిబొమ్మలా నాకేసి చూస్తున్నాడు. 'సీరియస్'గా అడగ నారంభించాను.

"నేనీ పోర్షన్‌లోకి వచ్చిన దరిమిలా, ఏ పెళ్ళి కాని ఆడపిల్ల కన్నెరికాన్నయినా దోచానా ?"

"లే" దన్నట్లు తలాడించింది 'దిష్టిబొమ్మ !

"ఏ 'మగనాలి' పాతివ్రత్యాని కన్నా విఘ్నం కలిగించానా ?"

"ఉహూఁ..." అంది బొమ్మ.

"పోనీ మామ్మగారూ, పిన్నిగారూ అంటూ వరసలు కలిపి ఊరగాయలకోసం, పచ్చళ్ళకోసం ఆశ పడ్డానా?"

"అన్నన్నా...!" అని సమాధానం.

"మరేమిటి, సంసారుల యిళ్ళమధ్యలో ఉండి నేన్చేసిన అఘాయిత్యం?" అంటూ నిగ్గదీశాను.

"భాస్కర్రావ్" నోటికి "పక్షవాతం" వొచ్చింది. నోరు తెరిస్తేఒట్టు. రెండు నిమిషాల మౌనాన్ని మళ్ళీ నేనే భగ్నం చేశాను.

"ఇహఁ విను నా పంజాయిషీ. అంతకు ముందు నీ బుఱ్ఱ చల్లబడటానికి "షర్బత్" పుచ్చుకో" అంటూ అప్పుడే కలపటం పూర్తయిన "నిమ్మకాయ షర్బత్" గ్లాసులో నింపి యిచ్చేను.

అసలే వేసవికాలం గ్లాసెడు షర్బత్‌తో "గంపెడు" ఉపశమనం కలిగి కోపాలు, తాపాలు చల్లబడ్డాయి.

"చూడు భాస్కర్రావ్ ! నువ్వు కుర్రాడివి ఎందుకో నువ్వంటే నేనిక్కడకొచ్చినదగ్గర్నుంచీ నా కిష్టం. ఎందుకంటే నిన్నో "గుడ్‌బోయ్‌గా" గ్రహించడమే. అందుకే చనువిచ్చాను. ఇచ్చాను గనుకే ఇంత ధైర్యంగా యీ నాడు ఎవ్వరూ నేటి వరకూ అడగసాహసించని విషయాన్ని అడిగావ్, ఫర్వాలేదు.

నేనట్టే బాధపడటంలేదు, మంచిగానీ,చెడుగానీ మనసుకి నచ్చినవాడికి చెప్పుకోవటం ఆత్మకి శాంతి.

నాకు భార్య వుందన్నాను. నాకు భార్య నిజంగా ఉంది. ఐతేఆమె లోకానికగుపడదు, నా కలల్లో ఎప్పుడూ మెదులుతూనే వుంటుంది. నా కళ్ళలో నిండుతూనేఉంటుంది. అదుగో. ఏదో ఊహించుకుని విచారభంగిమ పెడుతున్నావ్. నో.. నో.. నో! నా భార్య మరణించిందనే 'కంక్లూజన్" కొచ్చి. "అయామ్ వెరీసారీ" అంటూ మధ్యలో లేచివెళ్ళిపోతే కథ పూర్తికాదు. సిడౌన్. సాంతం విను.

అదిగో- ఆ మేజాబల్లమీద "వీనస్" విగ్రహం ఉంది చూడు. "వీనస్" అంటే గ్రీకుల అందాల దేవత. గాడెస్ ఆఫ్‌బ్యూటీ ! అవునా ? ఆమెకన్నా నా భార్య అందగత్తె. అదుగో నీ మొహంమీదే "అసూయ !" నే కనిపెట్టేయగల్నోయ్. "ఫేస్ యీజ్ ది యిండెక్స్ ఆఫ్‌దిమైండ్" అని ఎప్పుడో నేర్చుకున్నా నువ్వు "అసూయ" పడితే నాకుఆనందమే, డోన్ట్‌ఫియర్. మధ్యలో "అసూయ"ని హత్య చెయ్యకు. దాన్ని "ఫ్రీ"గా వొదిలేయ్.

ఏమనిచెప్పాను ? నాభార్య "వీనస్"ని అందంలో ఓడిస్తుందని గదూ ! అంతేకాదు. "దమయంతి" పేరువిన్నావ్‌గదూ. అదేనోయ్ "శృంగార నైషధం" అందులో "దమయంతి"ని వరించడానికి అష్ట దిక్పాలకులు వచ్చి "నామినేషన్లు" పడేశారుట. "డిపాజిట్లు" గల్లంతయ్యాయనుకో. అసిపేరేమాట.

అదుగో ఆ "దమయంతి" నాభార్యకి పరిచారికగాకూడ పనికిరాదంటే "స్వోత్కర్ష"అనుకుంటావ్ నువ్వు. అసలు అదంటేనే "ఎలర్జీ" నాకు!

ఇంతాచెప్పి. కనీసం నాభార్య ఫొటోఅయినా చూపిస్తానని నువ్వు ఆశపడటం అపరాధంకాదు. అంతకుముందు నీకు మరో విషయం చెప్పాలి. ఆ అల్మార్లోని ఉత్తరాలకట్ట యిలా తీసుకురా...

ఇదిగో... యీ ఉత్తరం చదువు. సంకోచించకు. ఫర్వాలేదు. నేను "పర్మిషను" యిస్తున్నాను. చదువు. ఏం ? అలా నీరసించి పోయావేం ? ఒట్టి మామూలు విషయాలనేనా ! వినటానికి, చదవటానికీ యివి ఎంత స్వల్ప విషయాలో మోయటానికి అంత పెనుమయిన బరువులు !

యీ ఉత్తరం రాసినవాడు నా రెండోతమ్ముడు. వాడితర్వాత యింకో యిద్దరు తమ్ముళ్ళు, ఓ చెల్లెలూ ఉన్నారు. మాకు మిగిలిన పెద్దదిక్కు, మా అమ్మే. మాకు ముందువెనుకల ఏమీ ఆస్తి, పాస్తులు లేవు, నా రెక్కల శక్తే మాఅందరి ఆస్తి. ఇంకోవిధంగా చెప్పాలంటే మావాళ్ళందరికీ నేను "స్వారీ గుఱ్ఱాన్ని" వాళ్ళు పైకొస్తే నేను తరించినట్లు, లేక నాస్వార్థంతో వాళ్ళని నిర్లక్ష్యంచేస్తే, ఏరుదాటి తెప్పని తగలబెట్టినట్లు ! అందుకే వాళ్ళ భారం నేను మోస్తున్నాను, ఏడుస్తూకాదు - నవ్వుతూనే, ఎందుకంటావా ? ఏడవటమంటె, అసమర్థత కనుక !

ఆఖర్ని ఒక్కందుకు విచారించక తప్పటంలేదు. మరెందుకో కాదు. నా భార్య ఫొటో నీకు చూపలేకపోతున్నందుకు ! అది 'సేఫ్'లో ఉంది. తాళం చెవి పారేసుకున్నాను. కానీ, నా రేడియం కళ్ళకి ఆమె అగుపిస్తూనే వుంది.

నా భార్య చాలా అందగత్తె భాస్కర్రావ్ ! ఇదిగో చూడు. చూడగలిగితే నేను "సేఫ్' అన్చెప్పుకున్న యీ హృదయంలోకి చూడు. దీనికి తాళం తీయడమంటే గుండె చీల్చుకోవటమే !

ఆ పని నేను చెయ్యలేను.

నా భార్య చాలా అందగత్తె భాస్కరరావ్! అంతేకాదు, చాలా...చాలా...అదృష్టవంతురాలు. ఎందుకంటే, ఆమె ఒక 'బ్రహ్మచారి'కి భార్య కాగలగటమే !"

'భాస్కరరావు' లేచాడు. ఒక్కక్షణం మౌనం పాటించి "వస్తాను మాస్టారూ!" అంటూ బరువుగా నిష్క్రమించాడు ... ★

